# అందవిశాలి




## కప్పగంతుల మల్లికార్జునరావు

రాజకుమారి నేను మంచి స్నేహితులం కాని చాలా విషయాల్లో దానిది దక్షిణ ధృవం నాది ఉత్తర ధృవం.

మనస్తత్వ పరిభాషలో చెప్పాలంటే అది 'ఇంట్రోవర్ట్'. అంతర్ముఖి. చుట్టూతా వున్న ప్రపంచమే పట్టనట్లు ఎప్పుడూ ముభావంగా వుంటుంది. ముక్తసరిగా మాట్లాడుతుంది. ఎంత బాధనీ, సంతోషాన్ని ఒకరితో చెప్పకోదు. దాని మనసులో ఆలోచన తెల్సుకోటం బ్రహ్మతరంకూడా కాదు. 'నిండు కుండ' అని నిక్‌నేమ్ పెట్టి ఏడిపించేదాన్ని.

నా తత్వం పూర్తిగా విభిన్నం. ప్రపంచంలో కష్టాలు, సుఖాలు, సమస్యలు అన్నీ నావే అయినట్లు నెత్తినేసుకొని వూరికే హైరానపడిపోతాను నా నోట్లో నువ్వు గింజ నానదు. ఒక్క క్షణం నా నోరు మూతపడదు. క్షణంలో స్నేహం చేసికో గలను. అంత సులభంగా మర్చిపోగలను సర్దాగా పదిమందితో కల్సి తిరగటం నాకు యిష్టం ఇవన్నీ 'ఎక్స్‌ట్రోవర్ట్' లక్షణాలు.

సర్దాగా నాకేదన్నా నిక్‌నేమ్ పెట్టవే అని ఎన్నోసార్లడిగేను రాజకుమారిని. నవ్వి వూరుకొంది

మాది ఆడపిల్లల కాలేజీ. పది గంటలకు లోపలికి ప్రవేశిస్తే అంతఃపురంలో రాణీవాసమే సవా లక్ష కట్టుబాట్లు. ఒకరో యిద్దరు ముసలి మేస్టర్లు, గుమాస్తాలు, నౌకర్లు తప్ప — ఎటు చూచినా చీరెలు, జడలు, పూలు... పరమబోర్!

కాలేజీ అయ్యాక రోడ్డుమీద పడితే జైలు నుంచి బయటపడ్డంత రిలీఫ్ రకరకాల పేంట్లు, షర్టులు, క్రాపులు... మాకోసం ఎదురు చూస్తుండేవి

రాజకుమారి నేను కల్సి కాస్త దూరం వెళ్లి ఆ తర్వాత వేర్వేరు మార్గాలకు చీలిపోయేవాళ్లం. దానిపక్క నున్నంతసేపు మగపిల్లల్ని చూడనివ్వదు. తను చూడదు. పెద్ద పతివ్రతపోజులో తలవంచుకు పోవటం నాకు పెద్ద విరాగ్గా వుండేది

రాజకుమారి పచ్చగా వుంటుంది అయితే నల్లగా వున్నా నేనే దానికన్నా అందంగా ఆకర్షణీయంగా వుంటాను. మేమిద్దరం కల్సిపోతున్నప్పుడు దాన్ని ఒక్కరూ చూడరు. అందరి కళ్లూ నామీదే.

మేమిద్దరం చీలిపోయేచోట నాకోసం రోమియోలు నిరీక్షిస్తుండేవారు వాళ్ల కళ్ళల్లో

ఆరాధన చూస్తుంటే నాకేదో థ్రిల్! వాళ్ళు నా వెంటపడి యింటిదాకా బాడీగార్డ్సులా వస్తూ ఏవో వర్షాకబుర్లు చెప్పుకొంటూంటే నేను రాజకుమార్తెనైనంతగర్వంగా వుండేది నాకు.

ఆ కబుర్లు, నాకొచ్చే ప్రేమలేఖల సారాంశం. ఇవన్నీ రాజకుమారితో చెప్పుకోవాలని సర్దావడేదాన్ని.

'నే నిలాంటివి హర్షించను జానకీ. నా కిష్టం వుండదు.'

'నా కిష్టంగా. అందుకనైనా వినుమరి!'

'జీవితమంటే యిదికాదు.'

'పుస్తకాలా ?'

... .. ...

'పెళ్ళి!'

'ప్రేమ — పెళ్లి! వ్యర్థపదాలు వీటికోసం అన్వేషణ వ్యర్థం. అంతకన్నా మించిన జీవిత విలువ లున్నాయి. నీది చిన్నపిల్లల తత్వం—'

తను పెద్దముసలిదైనట్లు! వెర్రి వేదాంతం!

వాళ్ల అమ్మకన్న ఆరుగురు ఆడపిల్లల్లో రాజకుమారి నాలుగోది వాళ్ల నాన్న పెద్ద పౌరాణిక నాటకాల నటుడు.

కొడుకులు పుడితే గొప్ప గొప్ప నటుల పేర్లు పెడ్దామనుకొన్నాట్ట. ఆడపిల్లలు పుట్టినా సంకల్పం మార్చుకోలేదు. నటుల పేర్లను స్త్రీలింగాల్లోకి మార్చేసి కూతుర్లకు పెట్టేడు. రాజకుమారి అసలు పేరు 'నటరాజకుమారి'. వాళ్ల నాన్న దాన్ని 'నటరాజా' అనే పిలుస్తుంటుంటాడు.

పేరు నటరాజా కాని దానికి కళాదృష్టి అసలు లేదు. సినిమాలు. నాటకాలు ఎప్పుడోకాని చూడదు. దానికి పుస్తకాల పిచ్చి జాస్తి. కన్పించిన చెత్తనల్లా విచక్షణ లేకుండా చదివేస్తుంది.

'బుర్ర పాడవుదుటే —'

'పదునెక్కుతుంది'

'ఎందుకు ? నన్ను చంపుతున్నావ్ చాలదూ ? మొగుడిని కూడా రాచి రంపాన పెట్టటానికా ?'

'ఛీ! నీకు మొగుడిపిచ్చ తప్ప మరోటి లేదు. నా కసహ్యం.'

స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణలో వున్న మాధుర్యాన్ని ఆ వేదాంతికి చెప్పే శక్తి లేదు నాకు!

మా అభిరుచుల్లో యింత విభేదాలున్నా స్నేహబంధం పెరిగింది. రాజకుమారి ఒక్క రోజు కన్పించకపోతే వెతుక్కొంటూ వెళ్లేదాన్ని.

అప్పుడు మాత్రం రాజకుమారి ఆప్యాయంగా నన్ను కౌగిలించుకొనేది. సర్దాగా మాట్లాడేది.

'పోనీ నన్ను పెళ్లి చేసుకోరాదుటే మీ నాన్నకు కట్నం గొడవ తప్పుతుంది.'

'పొట్టి మొగుడు — పొడుగు పెళ్ళాం. బక్క మొగుడు — బరువు పెళ్లాం' నేనూ ఎగతాళి చేసేదాన్ని.

'ఆఁ ఆఁ తెల్ల మొగుడు — నల్ల పెళ్ళాం. నీ కిష్టమేగా ?'

బి. ఏ. యిలాగే అయిపోయింది. పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు మా వూళ్లోనే పెట్టటంతో యమ్మే ఎకనామిక్స్‌లోకి అప్లికేషన్ పెట్టేను నేను.

రాజకుమారి కుటుంబ పరిస్థితులేం బాగా లేవు. నాటకానితనాన్ని తండ్రి వేదాంతం అనే ముసుగుతో కప్పుకొన్నాడు. గంపెడంత సంసారాన్ని కనిపెట్టాల్సిన బాధ్యత దాని బాబాయిమీద పడింది.

ఆయన పేరు రాధాకృష్ణయ్య. ఆజన్మ బ్రహ్మచారి. అకళంక దేశభక్తుడు. స్వచ్ఛంద ప్రజాసేవకుడు. రాజకీయవేత్తల్లో 'అజాతశత్రువు'. పదవులెన్నో వెంటబడ్డా కాదన్న త్యాగి. దీనజన సేవ ఆయన పని.

యమ్మేల్లేగా ఎన్నో సీట్లగా వున్నా ఆయన సంపాదించింది నిస్వార్థపరుడు, నిరాడంబరుడు, నిక్కచ్చి మనిషి అన్న పేరూ, బిరుదులే!

రాజకుమారి చదువు ఆపటం నాకు యిష్టం లేకపోయింది. అది తెలివిగలది. నిప్పులాంటిది.

చొరవచేసి రాధాకృష్ణయ్యగారితో ప్రస్తావించాను.

ఫలితంగా రాజకుమారి తెలుగు యమ్మేలో, నేను ఎకనామిక్స్ యమ్మేలో చేరేము.

* *

మా యింటినుంచి కాలేజీకి వెళ్ళే దోవలో మెయిన్‌రోడ్డు మీద పాత పుస్తకాలషాపు ఒకటుంది. అక్కడ అన్నిరకాల పత్రికలు, పుస్తకాలు అద్దె కిస్తారు.

గొంతులు తొడుక్కొన్నే రోజుల్నుంచి నేను ఆ షాపును, ఆ షాపు యజమానిని చూస్తూనే వున్నాను. అతని పేరు రాంప్రసాద్. కాలేజీ కుర్రాడి కన్నా పెద్ద స్టైల్‌గా వుంటాడు. అప్ టు డేట్ ఫేషన్స్ అన్నీ అతని దగ్గరే పుట్తుంటాయి. పచ్చటి శరీరచ్ఛాయ, నల్లటి రింగుల జుట్టు, విశాలమైన కళ్ళు, అంత పొడుగు పొట్టీ కాని విగ్రహం, పెదవుల మధ్య ఎప్పుడూ రెడీమేడ్‌గా కన్పించే చిరుదరహాసం — అతని వయసుని గురించి ఆలోచించనివ్వవు. అతనొక్కొక్కప్పుడు గడ్డం పెంచుతుంటాడు. అప్పుడూ సీతారామరాజులా అందంగా వుంటాడు.

అతనికి తెలియని విషయం, మాట్లాడని విషయం లేదు. ఏది మాట్లాడినా వినేవాళ్లకి మత్తు వొస్తుంది. మోహముద్రలో పడ్తారు.

నా చిన్నతనం నుంచి మావాళ్ళు అతడిని గురించి కథలు చెప్పుకోటం విన్నాను. అన్నిటి సారాంశం ఒక్కటే. చాలామంది ఆడపిల్లల్ని ఆకర్షించి మోసం చేశాడు. పద్ధతులేవైనా చివర ఫలితం ఒక్కటే — అన్ని కేసుల్లో!

విని విని అతనంటే నాకు ఏహ్యభావం కలిగింది

కాని అతని షాపుకు వెళ్లటం చాలామంది ఆడపిల్లలకు ఫేషన్. అతని కబుర్లు వినటం, కబుర్లు చెప్పటంలో ఎక్స్‌పీరియన్స్!

అంచేత బి.ఏ.లో వుండగా మా యింటిదగ్గర స్నేహితురాళ్లతో కల్సి నేనూ అప్పుడప్పుడూ అతని షాపుకు వెళ్తుండేదాన్ని. నా అభిరుచిని గమనించి కబుర్లు చెప్పి నన్ను ఆకర్షించాలని ప్రయత్నించాడు. నిన్న మొన్నటిదాకా అతని కొట్టుముందు గొంతు లేసుకొని తిరిగినదాన్ని. అంత పెద్ద యీడువాడు నాతో ప్రేమకబుర్లు చెప్పబోతే మండేది. అతనంటే 'ఎలర్జీ' ఏర్పడింది.

'మిస్ జానకీ. మీరు సినిమా ఏక్ట్రెస్‌లా వుంటారు. మనవాడో పిక్చర్ తీస్తున్నారు ఛాన్సు వస్తే అంగీకరిస్తారా ?'

అదేమిటో అతని మాటల్లో నాకెప్పుడూ శ్లేష విన్పిస్తుంటుంటోంది.

'మీకు బ్రహ్మాండంగా వచ్చే పుస్తకం నా దగ్గర ఒకటి వుంది మిస్. కొత్తది. గొప్పగా వుంటుంది. మీకు బాగా నచ్చుతుంది. మీకోసం తీసి రెడీగా వుంచుతాను. రేపోసారి షాపులో రద్దీ లేనప్పుడు వస్తారా ? ప్లీజ్.'

అతని మొహం పగలగొట్టాలని, బుర్ర గొరిగించెయ్యాలని, పొడుగైన ఆ ముక్కు కత్తిరించెయ్యాలని, అనిపించింది.

'అలాగే పెదనాన్నా. రేపు నేను మా అన్నయ్య వస్తాం. పుస్తకం తీసివుంచండి.'

రాంప్రసాద్ మొహంమీద తెర్లుతున్న మజ్జిగ పులుసు పోసినట్లయింది. కానీ అలవాటుపడ్డ ఘటం! 'హార్టీ వెల్‌కమ్ చైల్డ్' అన్నాడు నవ్వుతూ.

జీవితంలో నటించే నటుడు! కట్‌త్రోట్ రేస్కెల్!

ఆ తర్వాత అతని షాపు చాయలకి వెళ్లటం మానుకొన్నాను.

* * *

బి.ఏ.లో వుండగా చిలిపి వేషాలు వేస్తుండేదాన్ని. కాలేజీలో మేడమ్స్‌ని ఏడిపిస్తుండేదాన్ని. నిక్‌నేమ్స్ పెట్తుండేదాన్ని

అదేం చిత్రమో! యమ్మేలో చేరిన కొద్ది రోజుల్లో చిలిపితనమంతా మటుమాయమయింది.



హైదరాబాద్‌లో ప్రధానమంత్రి శ్రీమతి యిందిరాగాంధీకి స్వాగతం చెపుతున్న శ్రీమతి డా. లక్ష్మీ రఘురామ్

అదో రకమైన గంభీరత అలవాటు పడింది. కారణం — యమ్మేలో చేరేనన్న భావన కావచ్చు. ప్రొఫెసర్లు, రీడర్లు, మగపిల్లలు, కొత్త మొహాలు, కొత్త పద్ధతులు, కొత్త వాతావరణం కావచ్చు.

'నువ్విలా వుండటంకన్నా అలా వుంటేనే బాగున్నావే' రాజకుమారి అందో రోజు. కానీ మళ్లీ ఆ రోజులు రావేమో!

రాజకుమారిలా రిజర్వుడుగా వున్నా ప్రీవియస్ చివర్లో నేనో సమస్యను ఎదుర్కోవాల్సివచ్చింది.

మా క్లాసులో శాస్త్రి అని వొకతనున్నాడు. నల్లగా వున్నా నాలాగే మంచి కళగల మొహం. నేను కాలేజీలో చేరిన దగ్గర్నుంచీ నావైపు అతను ఆరాధనగా చూడటం గమనించాను. అయినా అతనొ్త ఎన్నడూ మాట్లాడలేదు.

చివరికి ధైర్యంచేసి ప్రేమలేఖ యిచ్చాడో రోజు. సారాంశం మామూలే. కానీ ప్రతి అక్షరంలో అతనికి నాపట్ల నున్న ఆరాధన నన్ను ముగ్ధురాలిని చేసింది. రాజకుమారి సలహా అడిగేను.

'అయితే మతాంతర వివాహం చేసుకొంటా వన్న మాట!'

'మతాంతరమా!' అంటూ తెల్లమొహం వేశాను.

'ఇలా వుంటాయే మీ ప్రేమలు! అతను క్రిస్టియన్. పేరు డేవిడ్‌శాస్త్రి.'

ఆశ్చర్యంతోపాటు సిగ్గుపడ్డాను. కానీ యీ విషయం రాజకుమారి కెలా తెలిసినట్లు?

డేవిడ్ శాస్త్రిని వొంటరిగా పిల్చి గట్టిగా గడ్డి పెట్టేను.

'పొరపాటే మిస్ జానకీదేవీ! నా రెలిజియన్ తెలిస్తే నేనంటే యిష్టపడరని చెప్పలేదు. తర్వాత చెప్దామనుకొన్నాను. కానీ శాస్త్రి అన్న పేరు నా యస్సెల్సి రిజిస్టర్‌లోకూడా వుంది. మిమ్మల్ని మోసంచేయాలని తగిలించుకోలేదు.'

జాలేసింది. దయగలిగింది. చల్లబడ్డాను.

'మతమే మన ప్రేమకు అడ్డయితే మీ మతం స్వీకరిస్తాను జానకీదేవి! మీరు చెప్పినట్లల్లా వింటాను. కాని మీరు కాదంటే నాకు పిచ్చెక్కుతుంది. నా ప్రేమకు ఉరిశిక్ష విధించకు జానకీదేవి! నన్ను కనికరించు.'

నాకు కాబోయే భర్త నన్నిలా ఆరాధించటం నాకిష్టం. అతడిని పెళ్లి చేసుకోటానికి నాకు అభ్యంతరంలేదు వ్యక్తిగతంగా. కాని మా కుటుంబం, ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు?

వాటిని అమాంతంగా తెంచేటంత ధైర్యం లేకపోయింది.

'అరిచే కుక్క కరవదే. కబుర్లు చెప్పేవాళ్లు కార్యశూరులుకాలేరు—' రాజకుమారి ఎగతాళిచేసింది.

డేవిడ్‌శాస్త్రిని గురించి ఆలోచనల్లో వుండగానే ఫైనల్ యియర్‌లో రెండు టరమ్‌లు గడచి పోయాయి.

రాజకుమారి అప్పుడు పేల్చింది ఆటంబాంబు లాంటి వార్త!

రాజకుమారి రాంప్రసాద్‌ని ప్రేమించి పెళ్లి చేసుకోబోతోంది!

## అడవి పూలు

ఆ వార్త అది యెంతో ఆనందంగా చెప్పినా నాకు వెగటుగా విన్పించింది. అసహ్యంగా తోచింది. నాకూ రాంప్రసాద్‌కు మధ్య అప్పుడు జరిగింది చెప్పలేదు. ఎగతాళి చేస్తుందని భయపడ్డానప్పుడు. పొరపాటయిందేమో!

'ఏమిటే ఆలోచన? మీ శాస్త్రికన్నా అందంగా వుండడా?'

రాంప్రసాద్ నిషా దాని తలకెక్కింది మనసు మత్తులో మునిగివుంది. దాని మనసుకు చేదుగా వున్నా మందు యివ్వక తప్పదు.

'నాగుపాములు, చిరుతపులులు, సింహాలు కూడా దూరంగా చూడటానికి అందంగా వుంటాయే. అలాగని కౌగిలించుకొంటామా?' అంటూ అతడిని గురించి నేను విన్నది, నా అనుభవాన్ని, యితరుల అనుభవాల్ని అన్నీ గబగబా ఏకరువు పెట్టేను.

రాయిలా మొహంపెట్టుకొని వింది అన్నీ. చివరికి తొణగకుండా శాంతంగా అంది 'థాంక్స్! సలహాకు సలహా. బదులు తీర్చుకొన్నావు. సంతోషం. రాంప్రసాద్‌ను నేను బాగా స్టడీచేసే ప్రేమించా. అయినా నువ్వు చెప్పిన కథల్ని కాదనను. అయితే మన బుద్ధినిబట్టి, ప్రవర్తననుబట్టి అతని ప్రవర్తన వుంటుందేమో నా విషయం వేరు.'

ఎంత నిష్ఠూరం? ఎలాంటి నీచమైన అభియోగం నాపైన?

అయినా కోపంతెచ్చుకోకుండా చివరి ప్రయత్నం చేశాను.

'పోనీ అతనికి పెళ్లయింది. భార్య వుంది. అదన్నా వొప్పుకొంటావా?'

'నాకావిడ యిప్పుడు మంచి స్నేహితురాలు. ఆవిడ మా ప్రేమకు ప్రతిబంధకం కాదు. మా పెళ్లిని ఆవిడే ప్రోత్సహించింది.'

అంతే. ఆ తర్వాత నాతో మాట్లాడటం తగ్గించింది.

గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు డేవిడ్ శాస్త్రి పెళ్లికి శుభలేఖ యిచ్చాడు.

'క్షమించు జానకీదేవీ. మావాళ్లు హిందూ స్త్రీని చేసుకోటానికి వొప్పుకోలేదు పైగా యీ పెళ్లిద్వారా నాకు అమెరికా ఛాన్సు వచ్చింది.'

పైకి ఎన్నో కబుర్లు చెప్పే నేనెంత అమాయకురాలినో, వెర్రిదాన్నో తెల్సింది. ఆ క్షణంలో నా వివాహ సమస్య మా వాళ్లకు వదిలేసేను.

'పెళ్లికి తప్పక రావాలి. మిసెస్ డేవిడ్ చాలా అందంగా వుంటుంది.'

అంతటితో వదిలివెళ్లినా బాగుండేది.

'మీ స్నేహితురాలితో మీరైనా చెప్పక పోయారా? ఆ రాంప్రసాద్‌గాడొక స్కౌండ్రల్. మీ రాజకుమారి అందరి నోళ్లల్లో నానుతోంది. త్వరలో గోడలమీది కెక్కుతుందేమోకూడా. చెప్పండి పాపం.'

*　　*　　*

మరో పదిహేను రోజుల్లో పరీక్షలు. బాగా చదవాలని ఎంత ప్రయత్నించినా మనసు చదువుపైన లగ్నం కావటంలేదు.

రాజకుమారి గోడల కెక్కింది. నాచేత చెప్పించుకొనే స్థితిలో లేదు. నేను తాపత్రయ పడటమేకాని అది నాతో మాట్లాడటానికి వుత్సాహం చూపటంలేదు.

'జానకీ నువ్వు నాకో సహాయం చేస్తావని వచ్చాను' అంది వోరోజు తనుగా తను మా యింటికొచ్చి.

'రాంప్రసాద్ నేను పెళ్లి చేసుకోబోతున్నాం! వచ్చే ఆదివారం బెజవాడ కనకదుర్గ గుళ్లో. మా యింట్లోవాళ్లకి తెలియదు. రహస్యం. నావైపు పెళ్లి పెద్దవి నువ్వే.'

ఎన్నో అనుమానాలు — ప్రశ్నలు? అన్నీ తెల్సినట్లే అంది:

'అన్నీ ఆలోచించానే. నా సంగతి తెల్సుగా. పరిణామాలను భరించటానికి సిద్ధపడుతున్నాను. కథల్లోలాగా ఎవరికోసమో నేను త్యాగాలు చెయ్యలేను.'

'కాని ఎందుకింత సాహసం?'

'ప్రేమకోసం. అందులో థ్రిల్ నీకు అర్థం కాదులే. అయిదేళ్లు ప్రేమకబుర్లు చెప్పేవు ఎన్నో సాహసాలు చేశాననుకొన్నావు. కానీ నీ కసలు ప్రేమ స్వరూపం తెలీదు. సాహసంలో వున్న థ్రిల్ అనుభవం లేదు. పూర్ ఫెలో...'

పెళ్లికి వెళ్లాలనే అనుకొన్నాను. కాని సమయానికి ధైర్యం చేయలేకపోయాను.

మర్నాడు రాజకుమారి ఆచూకీ కోసం వాళ్ల వాళ్లు వచ్చారు. కానీ నేను దానికి ప్రామిస్ చేశాను— చెప్పనని. అంచేత చెప్పలేదు. మా నాన్న, అన్నయ్య ఆ తర్వాత నాచేత నిజాన్ని కక్కించేరు.

బెజవాడంతా వెతికినా రాజకుమారి ఆచూకీ తెలియలేదుట!

పరీక్ష రోజు ప్రశ్నాపత్రం తీసుకొంటుండగా రాజకుమారి కన్పించింది. ఎన్నో ప్రశ్నలు?

## చీకటి - వెలుగులు

ఎటు చూసినా కటిక చీకట్లు
కానవస్తున్నాయని
కన్నీరుమున్నీరుగా ఏడుస్తూ
కంగారుపడకు
అదిగో అటు చూడు
నిశ్శబ్దమైన చీకట్లలో
సుతారంగా మెరిసే దీపం పురుగు
ఇంకా ముందుకు నడు
నీలాకాశంలో నక్షత్రాల కాంతులు

దట్టంగా కారుమేఘాలు
అల్లుకుంటున్నాయని
ఆకాశం ఆరుస్తోందని
అదిరిపోయి అడుగులు వెనక్కివేయకు
ఆ అరుపులనుండే వర్షం
అపుడే దేశం సస్యశ్యామలం
అప్పుడే నెమళ్ళ నాట్యం
అప్పుడే వెలుగులు విరాజిల్లుతాయి!
ఈ చీకటి వెలుగులే జీవితం

— *జంధ్యాల నాగేశ్వరరావు*

సందేహాలు ? వాటికి సమాధానాలు ఆలోచించు కొంటూ పరీక్ష వెడగొట్టేసేను.

'పెళ్ళికి రాలేకపోయాను. క్షమించు రాజా ! బాగా జరిగిందా ?'

'ఏం ? నువ్వు రాకపోతే జరగదనుకొన్నావా ?'

దాని నిష్ఠూరాన్ని నేను పట్టించుకోలేదు.

'యిన్నాళ్లూ ఎక్కడున్నావ్ ? నీకోసం...'

'పులుల వేటను తప్పించుకోటానికి అజ్ఞాత వాసం చేసేను —'

'పరీక్ష బాగా రాసేవా ?'

'ఫస్టుక్లాసు తప్పదు.'

అన్నట్టుగానే అది ఫస్టుక్లాసులో పాసయింది. నేనుమాత్రం సెకండ్ క్లాసులో పాసయ్యాను !

* * *

నా పెళ్లికి స్వయంగా శుభలేఖ యిచ్చి ఆహ్వానించవద్దామని రాంప్రసాద్ యింటికి వెళ్లా. రాజకుమారి ఆరు నెలలుగా అతన్తో కాపురం చేస్తోంది. మొదట్లో స్కూటర్‌మీద వెళ్తూ యిద్దరూ కన్పించేవారు తరచూ. ఈ మధ్య కన్పించటంలేదు.

నన్ను చూడగానే అది ఆశ్చర్యపోలేదు. మొహం యింతచేసుకొని ఆప్యాయంగా ఆహ్వానించ లేదు. 'రావే, కూర్చోవే' అంది నిర్లిప్తంగా.

'ఎలావుందే కొత్త జీవితం ?'

'నువ్వెలా వుందనుకొంటున్నావు ?''

దానివైపు పరీక్షగా చూచాను. ఆరునెలల క్రితం కళ లేదు దాని మొహంలో. తెచ్చిపెట్టుకొన్న గంభీరత్వం కన్పిస్తోంది. వాళ్ళ దాంపత్య జీవితంలో అపస్వరాలు విన్పిస్తున్నాయేమోనన్న అనుమానం కలిగింది.

'నీకేమే ! ప్రేమించి పెళ్లి చేసుకొన్నావ్ ? జీవితాన్ని నీకు నచ్చినవిధంగా మల్చుకోటం చాతనవును. నేను చూడు. మావాళ్ళు చూచి పెట్టిన వాడిచేత మూడుముళ్ళు వేయించుకో బోతున్నా. పెళ్లయ్యాక ప్రేమించటం నేర్చుకోవాలె.'

రాజకుమారి నవ్వింది. ఆ నవ్వుకు తాత్పర్యం గ్రహించే శక్తి నాకు లేదు.

'పెళ్లి యిక్కడే. తప్పక వస్తావుకదూ ?'

తలూపిందికాని రాలేదు. నా మనస్సు చివుక్కుమంది.

మరో ఆరు నెలల తర్వాత నేను పురిటికి పుట్టింటి కొచ్చేసరికి రాజకుమారి కథ చాలా దూరం పోయింది. రాంప్రసాద్‌తో తెగతెంపులు చేసుకొని పుట్టింటి కొచ్చేసిందిట. ఉద్యోగ ప్రయత్నంలో వుందిట ! కారణాలు మామూలే !

ఇంటి కెళ్తే రాజకుమారి లేదు. దాని తండ్రి పట్టుకొన్నాడు.

'అమ్మాయ్ ! దాని కథంతా తెల్సుగా ? అంతా తెల్సి వూరుకోటం బాగాలేదమ్మాయ్. చెప్పినట్లయితే అది చేతులు కాల్చుకోకముందే జాగ్రత్తపడేవాళ్ళం.' ఈ మాట వాళ్ళనుంచి వస్తుందని తెల్సు. పడటానికి సిద్ధపడే వచ్చేను.

'క్షమించండి బాబాయ్ !'

'పోనీలేమ్మా ! కాని యిప్పుడన్నా ఓ సహాయం చెయ్యి. వాడిమీద కేసు పెట్టానంటే వొప్పుకోవటంలేదు అది. నువ్వన్నా చెప్పి వొప్పించు.'

ఆ అవసరం నాకు లేకపోయింది. ఆరోజే రాజకుమారికి ఎక్కడో ఏజన్సీ ప్రాంతంలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. నన్ను చూడకుండానే వెళ్లిపోయింది.

తర్వాత నా జీవితం యాంత్రికం అయింది. పిల్లలు — రోగాలు — చదువులు — చాలీచాలని జీతాలు ... ఆశ ... ఆనందం...తృప్తి...పోరాటం !

నన్నంతా అదృష్టవంతురాలినన్నారు. అవును మరి ! మాఆయనకు బ్యాంకులో ఉద్యోగం. ఈమధ్యే ప్రమోషన్‌కూడా వచ్చింది. ముగ్గురు పిల్లలు. ఇద్దరు మగ, ఒక ఆడ. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకొన్నాను.

అయినా జీవితంలో ఏదో లోటు ? చెప్ప వీలులేని లోటు ? చెప్పుకోలేని కొరత !

రాజకుమారి ప్రఖ్యాత రచయిత్రి అయింది. విప్లవ ముద్ర వేసేరు దాని రచనలకు. ప్రతి రచనలోనూ మగాళ్ళపట్ల అసహ్యం, ద్వేషం స్పష్టంగా కన్పిస్తాయి. అక్షరం పొల్లుపోకుండా దాని రచన చదివి దానిపైన సానుభూతితో నిట్టూర్చేదాన్ని. ఎడారి అయిన దాని బతుక్కు ద్వేషమే సేదదీర్చే సరస్సు !

కాని దాని వ్యక్తిగత జీవితం యెలావుందో తెలియదు. అప్పటికీ వూరెళ్ళినప్పుడు అందర్నీ అడిగేదాన్ని. కాని యెవరూ దాని విషయాలపట్ల శ్రద్ధ చూపలేదు. రచయిత్రిగానే మాట్లాడేవాళ్ళు.

రాంప్రసాద్‌నే అడిగేను ఓ రోజు తెగించి కొట్టుదగ్గర. అతను పూర్వంలాగే వున్నాడు. కొట్టూ అలాగే వుంది. ఆడపిల్లలూ అలాగే వస్తున్నట్లుంది.

'ఎవరా రాజకుమారి ? గుర్తులేదే ? అయినా నా కొట్టుదగ్గర కొచ్చే ఆడపిల్లలంతా నాకు రాజకుమార్తెల్లాగే కన్పిస్తారు. ఎందర్నని గుర్తుంచుకోను ? అందని పండ్లే తియ్యగా వూరిస్తూ యెప్పటికీ గుర్తుంటాయి. తినేసిన పండుకు విలువేముంది ? ఏమంటారు ?' అన్నాడు గొప్పగా నవ్వుతూ.

ఆ తర్వాత రాజకుమారి సంగతులు తెలుసుకొనే ప్రయత్నంకూడా మానేసేను. క్రమంగా సంసారపు తాపత్రయంలో మర్చిపోయే స్థితిక్కూడా వచ్చేసే

అప్పుడు మరో అణుబాంబు పేల్చింది రాజకుమారి ! పెళ్లికి రమ్మంటూ ఆహ్వానం, ఓ పెద్ద ఉత్తరం వచ్చాయి !

పెళ్లి ! రాజకుమారి పెళ్లి ! !


వెళ్ళి అద్దంలో నా మొహం చూచుకొన్నా. బల్లమీద పెళ్లినాటి ఫొటో చూచా. నవ్వొచ్చింది ! యీ యీడులోనా రాజకుమారి మళ్ళీ పెళ్లి చేసుకొంటోంది ?

ఆయనకి తీరిక లేకపోటంవల్ల పెద్దబ్బాయిని తీసుకొని బయల్దేరా. రైలు, బస్సు, పడవ, అన్ని ప్రయాణ అనుభవాల రుచులు చూచి సరిగ్గా ముహూర్తం సమయానికి అక్కడికి చేరుకొన్నాం.

ఏజన్సీ ప్రాంతాలు నేనెప్పుడూ చూడలేదు. అందరు చెప్పుకొనేది వింటేనే భయంవేసేది. కాని అక్కడి వాతావరణం, నిశ్శబ్దత ప్రయాణపు బడలికను, నిముషంలో పోగొట్టింది.

పెళ్ళి యిల్లు కనుక్కొని హడావుడిగా వెళ్ళాం. నిశ్శబ్దంగా వుంది. బయట పందిరి లేదు. మేళ తాళాలు విన్పించలేదు షామియానాలు, కుర్చీలు... సెంట్లు, బూట్లు, పట్టుచీరెలు, నైలాన్ చీరెల హడావుడీ కన్పించలేదు.

ఇంటి ముందు చిన్న పంచలో యీతాకు చాపమీద కొందరు మనుష్యులు కూర్చొని వున్నారు. అడవుల్లో ఏదో అనాగరిక తెగకు సంబంధించిన



మనుష్యుల్లా వున్నారు. వాళ్ళు కట్టుకొన్న కొత్త చీరలు, ధోవతులు — కోతులకు కొత్తబట్టలు తొడిగినట్లున్నారు !

నన్ను చూడగానే లేచి నిలబడ్డారు. భాష అర్ధంకాలేదు కాని నన్ను గురించే ఏదో మాట్లాడు కొన్నారని అర్ధమయింది.

'వచ్చావా ? రావేమోననుకొన్నాను ! ఆహ్వానించిన యిద్దరు అతిధులు వచ్చారు. చాలా ఆనందంగా వుంది' అంది నన్ను చూడగానే దగ్గరి కొచ్చి ఆప్యాయంగా కౌగిలించుకొని రాజకుమారి. దాని మొహం వింతకాంతితో వెలిగిపోతోంది.

చిత్రం ! వయసు నాలో తెచ్చిన మార్పును అది ప్రతిఘటించినట్లుంది ! యిమ్మే చదివేటప్పటి కన్నా అందంగా వుంది.

'ముహూర్తంవేళ మిస్ అవుతానేమోనను కొన్నాను. ఇంకా ఏం హడావుడి కన్పించటం లేదేమిటి ?'

రాజకుమారి అడవిలో గాలికి చెట్ల ఆకుల సవ్వడిలా గలగల మృదువుగా నవ్వింది. నన్ను వాకిట్లోకి తీసికెళ్ళి వొకాయనను పరిచయంచేసింది.

'ఈయనే నా భర్త. ఇప్పుడే పెళ్ళి, వాళ్ళ సంప్రదాయంప్రకారం అయిపోయింది. బాబాయే పౌరోహిత్యం వహించాడు.'

రాజకుమారి ఆ అడవిమనిషినా పెళ్ళి చేసుకొంది ? మొహం, శరీరం అంతా మొరటుగా వుంది. కానీ కళ్ళల్లో ఏదో కాంతి — పట్టుదల, నిశ్చితత్వంతో కల్సి మెరుస్తోంది.

'మీరు కనీసం ఓ వారం రోజులైనా యీ అడవి మనుష్యుల ఆతిధ్యం స్వీకరించాలండీ' అతని మాట స్వచ్ఛమైన సరస్సులో నీటిలా చల్లగా వుంది. తెలుగు మామూలుగానే మాట్లాడినా ఏదో యాస స్పష్టంగా విన్పించింది.

'థేంక్స్'

అతను అడవిలో పక్షిలా చిత్రంగా నవ్వేడు. థేంక్స్ అనేసి వెళ్ళిపోతే వూరుకోము. మేము వూరుకొన్నా వాళ్ళు వూరుకోరు.' అల్లంత దూరంలో వున్న నలుగురు ఆడవాళ్ళవైపు చూపేడు. వాళ్ళకు ఏమర్ధమయిందో ఏమో నావైపు ఆరాధనగా చూస్తున్నవారల్లా స్నేహపూర్వకంగా నవ్వేరు.

వారం రోజులు కళ్ళు మూసి తెర్చినంత వ్యవధిలో దొర్లిపోయాయి. ఆ అడవి మనుష్యుల ప్రేమ వాత్సల్యాలని అభిమానాన్ని తనివితీరా తాగేను. అద్భుతమైన వారి ఆతిధ్యం నా మనసుమీద ఏదో టానిక్కులా పనిచేసింది.

యీ వారం రోజుల్లో రాజకుమారితో ఎన్నో సార్లు మాట్లాడేను. ఎన్నో కబుర్లు చెప్పుకొన్నాం. కాని నా మనస్సును పట్టి పీడిస్తున్న సందేహాల్ని అడిగే ధైర్యం లేకపోయింది. చివరి రోజు ఏదో మాటల సందర్భంలో అదే అంది.

'ప్రేమకూ వ్యామోహానికి భేదం తెల్సిందే యిప్పుడు. యవ్వనంలో వ్యామోహం తొందరగా పుట్టి అంత తొందరగానూ చస్తుంది. ప్రేమ అంకురించి పూర్ణ రూపం చెందటానికి చాలాకాలం పడ్తుంది. చాలామందిలో నడివయసులో ఆ ప్రేమ పూర్ణరూపం చెందుతుంది. ముసలితనంలో భార్యా భర్తలకు చేదోడువాదోడుగా వుంటుంది.'

దాని భావం నాకు అర్ధమయింది. అప్పటి మా ధోరణి వ్యామోహంవల్ల జనించింది. యిప్పటి తన పెళ్ళి ప్రేమలోనుంచి వచ్చింది.

రాజకుమారి, దాని భర్త అన్యోన్యంగా వుండటం యీ వారం రోజులూ కళ్ళారా చూచాను. వారిది భార్యాభర్తల సంబంధంగా కన్పించలేదు. మంచి స్నేహితుల్లా మెలిగేరు. పరస్పర గౌరవం — ఆరాధన !

'కానీ రాంప్రసాద్‌ని అంత తేలిగ్గా ఎలా మర్చిపోయావే ?'

'ఎవరా రాంప్రసాద్ ?' చాలా తేలిగ్గా అంది.

'కనకదుర్గ గుళ్ళో కట్టించుకొన్న మంగళ సూత్రాన్ని అంత తేలిగ్గా మర్చిపోయావా ?'

'ఓ ! ఆ విషయమా ? ప్రేమకు అర్ధాన్ని అన్వేషిస్తున్న రోజుల్లో ప్రేమ సూత్రమని కట్టించు కొన్నానే. ఉరితాడని తెలీగానే తెంపిపారేశా. ప్రేమకి ముడులు వుండవే. అతుకులు వుండకూడదు. రెండు గుండెలు కల్సిపోవాలి.'

నిజమే ! కానీ యీ అనాగరికపు అడవిజాతి వానిపట్ల దానికి అంత ప్రేమ ఎందుక్కలిగినట్లు ? అతనిలో ఏం చూచింది ? రూపమా ? ధనమా ? అధికారమా ? విద్యా ? అడిగేదెలా ??

మొదటి మూడు లేనట్లే కన్పిస్తుంది. అతను పగలస్తమానం అరక పట్టుకొని వ్యవసాయం చేస్తూనేవున్నాడు.

రాధాకృష్ణయ్యగారితోపాటు నేనూ బయలు దేరేను. దోవలో మనసులోనుంచి ఎగిసిపడుతున్న సందేహాలను ఆయన ముందు కక్కేను.

ఆయన నవ్వేరు.

'రాజా మొదటినుంచీ అందరిలాంటిది కాదమ్మా. ప్రత్యేకత దాని సొమ్ము. ప్రయోగాలు చేయాలని, అందరూ నడవని బాటలో నడవాలని చిన్ననాటినుంచి తాపత్రయం వుండేది. దాని మొదటి ప్రయోగం విఫలమయింది. రెండో ప్రయోగం దానికీ, దేశానిక్కూడా ఆరోగ్యవంత మయినది. దీన్ని నేను ప్రోత్సహించాను.'

'కానీ యీ యీడులో పెళ్ళి చేసుకొని ఏం చేద్దామని బాబాయ్‌గారూ ?'

ఆయన జాలిగా నావైపు చూచాడు — 'పెళ్ళంటే పిల్లల్ని కనటమేకాదు జానకీ. జీవితంలో వొక ధ్యేయంవైపు పయనించటానికి తోడుకూడా. వారిద్దరి ధ్యేయమూ వొకటే. అందుకే వారిద్దరి ప్రేమ ఫలిస్తుంది.'

పుట్టిందగ్గర్నించి నాగరిక ప్రపంచంలో పెరిగి, విద్యావతి అయిన రాజకుమారి ధ్యేయమూ, అడవుల్లో అనాగరికంగా విద్యావిహీనుడిగా పెరిగిన అతని ధ్యేయమూ వొకటెలా అవుతుంది ? యిది లెక్చరర్ ? అతను కర్షకుడు ?

'వారంరోజులు వాళ్ళమధ్య వుండికూడా నువ్వు గ్రహించింది యింతేనా ?' అన్నట్లు ఆయన నవ్వేరు.

'వృత్తి వేరు. జీవిత ధ్యేయం వేరు. మొదటిది తన శరీర పోషణకోసం. రెండోది మానసిక ఆరోగ్యంకోసం. ఇద్దరి జీవిత ధ్యేయం దీనజన సేవ. అదే వారిద్దర్నీ కలిపిన బంధం.'

నా ప్రశ్నలకు సమాధానాలు రాలేదు. కానీ మనస్సుకు ఏదో సత్యం లీలగా దృగ్గోచరమవుతోంది.

'కాగితం పూలని చూచి మురిసిపోవటానికి అలవాటుపడ్డామమ్మాయ్ మనం. అందమైన అడవిపూలలోని సౌరభ్యాన్ని అంత త్వరగా స్వీకరించ లేము.'

రాధాకృష్ణయ్యగారి మాటల్ని మననం చేసుకొనేకొద్దీ నాకు రాజకుమారి ఆకాశమంత ఎత్తుకు ఎదిగి కన్పించసాగింది. నా సందేహాలు తీరిపోయాయి. రాజకుమారి చేసిన సాహసాన్ని హృదయపూర్వకంగా అభినందించాను. దాని అదృష్టానికి అసూయకూడా వేసింది.

రైలు దిగి ఎవరిదోవన వాళ్ళం వెళ్ళేముందు రాధాకృష్ణయ్యగారు నిదానంగా అన్నారు : 'రాజకుమారి లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా యిచ్చిందమ్మాయ్ — దాని భర్తతోపాటు !'

సంభ్రమంగా చూచానాయనవైపు !

'అతను పోస్టుగ్రాడ్యుయేట్. యూనివర్సిటీ గోల్డు మెడలిస్టు. అయినా ఉద్యోగం వదిలేసి యిద్దరూ అడవుల్లో మనుష్యుల జీవితాల్లోకి వెలుగు తీసుకురావటానికి కంకణం కట్టుకొన్నారు.' నాకు నోట మాట రాలేదు.

'అందుకు కారకులెవరో తెల్సా ?'

నా మనసు ఆనందంతో ఉత్సాహంతో వెర్రిగా ఉరకలేస్తోంది.

'అతనుకాదు. మన రాజకుమారి ! దానిదంతా నా పోలిక. నాకు వారసురాలు.'

గర్వంగా, తృప్తిగా అనేసి చకచకా నడచి వెళ్ళిపోతున్న రాధాకృష్ణయ్యగారి వైపు చూస్తూ ప్రేమ పరమార్ధాన్ని గ్రహించాను !

## రచయితలకు విజ్ఞప్తి

★ ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురణకు పరిశీలనార్ధం మా కార్యాలయానికి చాలా ఎక్కువ సంఖ్యలో రచనలు, బొమ్మలు వస్తుంటాయి. నిబంధనలు పాటించి రచయితలు మాతో సహకరిస్తే తప్ప — ఆయా రచనల వైనం వారికి తెలియజేయడం సాధ్యం కాదని మేము పదే పదే విజ్ఞప్తి చేయటానికి కారణంకూడా అదే.

★ రచనలతోగాక, విడిగా స్టాంపులు పంపడం, స్వయంగా వచ్చి రచనలు, కార్టూన్‌లు యివ్వమని కోరడం చాలామంది చేస్తుంటారు. ఇది చాలా యిబ్బంది కలిగించుతుంటుంది కనుక — తమ రచనతో లేదా బొమ్మలతో స్వంత చిరునామా, హామీ పత్రం మున్నగునవి, జత చేసి యివ్వడం లేక పంపడం చాలా అవసరం.

★ కార్టూన్‌లు పంపేవారు వారికి తిరస్కరింపబడిన కార్టూన్‌లు తిరిగి కావాలనుకుంటే స్వంత చిరునామాగల స్టాంపు లతికించిన కవరు జత చేసి తీరాలి.

★ గేయాలు పంపేవారు వాటితోపాటు స్వంత చిరునామాగల తపాలా కార్డు జత చేయాలి. గేయాలు త్రిప్పి పంపబడవు. —సం.